


జాతీయ తెలుగు దినపత్రిక

RNI - TGTEL/25/A0348

# సందేశ టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు




| గురువారం 19 ఫిబ్రవరి 2026 | పేజీలు 04 | వెల రూ 2/- | సంపుటి : 1 సంచిక 263 | ప్రచురణ : తెలంగాణ & ఆంధ్రప్రదేశ్ | ఎడిటర్ : కాసే అమృత |
|---|---|---|---|---|---|



## మక్తల్‌లో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలను జాతరలా నిర్వహించాలి మంత్రి వాకిటి శ్రీహరి

సందేశం టైమ్స్, మక్తల్, ఫిబ్రవరి 19, 2026: మక్తల్‌లో ఈనెల 20 నుంచి 24 వరకు నిర్వహించనున్న సీఎం కప్-2026 రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలను జాతరలా నిర్వహించాలని రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పారిశ్రామికాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ఆదేశించారు. పోటీల నిర్వహణ ఏర్పాట్లపై ప్రజాప్రతినిధులు, జిల్లా అదనపు కలెక్టర్, జిల్లా ఉన్నతాధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించిన మంత్రి, తెలంగాణ రాష్ట్రం గర్వపడేలా పోటీలు నిర్వహించాలని సూచించారు. 33 జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొననున్నందున వారికి వసతి, అతిథ్యం, స్టేడియం, పారిశుధ్యం, విద్యుత్, భద్రత తదితర అంశాల్లో ఎలాంటి అసౌకర్యం కలగకుండా సమగ్ర ఏర్పాట్లు చేయాలని అధికారులను దిశానిర్దేశం చేశారు. కలెక్టర్ పర్యవేక్షణలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పోటీలను విజయవంతం చేయాలని పేర్కొన్నారు. క్రీడాస్ఫూర్తి పెంపొందించేందుకు ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల విద్యార్థులను పోటీల్లో భాగస్వాములను చేయాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఎంపీలు అతిథులుగా హాజరవనున్నందున వారందరిని గౌరవప్రదంగా ఆహ్వానించాలని సూచించారు. పోలీస్, స్పోర్ట్స్, శానిటరీ, మున్సిపల్, విద్యుత్ శాఖలు ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ ప్రతిష్టాత్మకంగా పోటీల నిర్వహణకు కృషి చేయాలని మంత్రి వాకిటి శ్రీహరి స్పష్టం చేశారు. టెలికాన్ఫరెన్స్‌లో జిల్లా అదనపు కలెక్టర్, జిల్లా క్రీడల అధికారి, విద్యుత్, మున్సిపల్ కమిషనర్లు, తహశీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ చైర్మన్ వాకిటి మానస హన్మంతులు తదితరులు పాల్గొన్నారు.

## విద్య, ఆరోగ్యానికి అత్యధిక ప్రాధాన్యం – హాస్టల్ మరమ్మతులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి

### డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క






సందేశం టైమ్స్, హైదరాబాద్, ఫిబ్రవరి 19: రాష్ట్ర ప్రభుత్వం విద్య, ఆరోగ్య రంగాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, ఈ రంగాల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు అవసరమైనన్ని నిధులు వెచ్చించేందుకు వెనుకాడబోదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు స్పష్టం చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో మైనారిటీ, బీసీ సంక్షేమ, రోడ్డు రవాణా, నీటిపారుదల, సివిల్ సప్లయిస్, రోడ్లు-భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల ప్రీ బడ్జెట్ సమావేశాలు నిర్వహించారు. మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, అజారుద్దీన్ తదితరులతో కలిసి సమావేశాలు నిర్వహించిన డిప్యూటీ సీఎం, సంక్షేమ వసతి గృహాలు, గురుకులాల బిల్లులు వేగంగా క్లియర్ చేస్తామని, హాస్టల్ భవనాల మరమ్మతులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులకు బయోమెట్రిక్ విధానం అమలు చేసి కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేయాలని, వసతి గృహాలపై సోలార్ పవర్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. డైట్, కాస్మోటిక్ చార్జీలు పెంచి కొత్త మెనూ అమల్లోకి తీసుకొచ్చామని, అధికారులు హాస్టళ్లను నిరంతరం పరిశీలించాలని, అవసరమైతే అక్కడే బస చేసి పరిస్థితులను అంచనా వేయాలని తెలిపారు. వరి సాగుకు బదులుగా పామ్ ఆయిల్, పప్పుధాన్యాల పంటలపై దృష్టి పెట్టాలని, రైతాంగానికి భవిష్యత్ ఇబ్బందులు లేకుండా పంట మార్పిడిని ప్రోత్సహించాలని సూచించారు. బీసీలకు బడ్జెట్‌లో ప్రాధాన్యత ఇస్తామని, గురుకులాలు, సంక్షేమ హాస్టళ్ల అద్దెలు, మెస్ ఛార్జీలు ప్రతి మూడు నెలలకు క్లియర్ చేస్తున్నామని వెల్లడించారు. మహిళల ఉచిత బస్సు ప్రయాణానికి సంబంధించిన మహాలక్ష్మి పథకాన్ని సమర్థంగా అమలు చేస్తూ త్వరలో మహిళలకు కార్డులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. గ్రామీణ విద్యార్థులు సివిల్స్, గ్రూప్స్ వంటి పోటీ పరీక్షలకు సిద్ధం కావడానికి నియోజకవర్గ కేంద్రాల్లో అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్లు ప్రారంభించి దేశంలోనే మోడల్‌గా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. లక్ష కోట్లకు పైగా నిధులతో రాష్ట్రంలో ప్రధాన రహదారుల నిర్మాణం జరుగుతోందని, రీజినల్ రింగ్ రోడ్ నిర్మాణానికి రుణం తీసుకునే ప్రక్రియకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలిపారు. రాష్ట్రంలో సంవత్సరం పొడవునా సాంస్కృతిక కార్యక్రమాలు కొనసాగేందుకు సినిమాటోగ్రఫీ శాఖ ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. సమావేశంలో వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



## రంజాన్ మత సామరస్యానికి ప్రతీక: ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి

సందేశం టైమ్స్, హైదరాబాద్, ఫిబ్రవరి 19: పవిత్ర రంజాన్ మాసం ప్రారంభమైన సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ముస్లిం సోదర సోదరీమణులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ నెలలో ముస్లింలు ఆచరించే ఉపవాస దీక్షలు, నమాజ్ ప్రార్థనలు ఆధ్యాత్మికతను పెంపొందించడంతో పాటు క్రమశిక్షణ, సహనం, దానధర్మాల పట్ల చైతన్యాన్ని పెంచుతాయని పేర్కొన్నారు. లౌకికవాదం, మత సామరస్య పరిరక్షణలో తెలంగాణ రాష్ట్రం దేశానికి ఆదర్శంగా నిలుస్తోందని సీఎం అన్నారు. ఈ పవిత్ర మాసాన్ని ప్రతి ముస్లిం సోదరుడు ఆనందోత్సాహాలతో జరుపుకొని అల్లా కరుణాకటాక్షాలు పొందాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.



## అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తాం: మంత్రి పొన్నం ప్రభాకర్

సందేశం టైమ్స్, హైదరాబాద్, ఫిబ్రవరి 19: హైదరాబాద్ జిల్లాలో అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి గృహ స్వప్నాన్ని నెరవేర్చడం ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మరియు హైదరాబాద్ ఇన్చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. బుధవారం సచివాలయంలోని తన ఛాంబర్‌లో రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి మొహమ్మద్ అజారుద్దీన్, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలతో కలిసి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక, రెండు పడకల గదుల ఇళ్ల నిర్మాణంపై సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం పేదల ఇళ్ల మంజూరీలో పూర్తిస్థాయి పారదర్శకత పాటిస్తుందని, ఎల్-1 కింద 4800 మంది అర్హులైన స్థలాలు ఉన్న పేదలకు రెండు పడకల గదుల ఇళ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. అలాగే ఎల్-2 కింద హైదరాబాద్ జిల్లాలో నాలుగు లక్షల ఇరవై రెండు వేలకుపైగా దరఖాస్తులు అందాయని వెల్లడించారు. నగరంలో అవసరమైన స్థలాలు సేకరించి జీ+5 నుండి జీ+10 అంతస్తుల వరకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించే ఆలోచనలో ప్రభుత్వం ఉందని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న 2బిహెచ్‌కే ఇళ్ల పనులను వేగంగా పూర్తి చేసి అర్హులైన లబ్ధిదారులకు అందించాలని అధికారులను ఆదేశించారు. మురికివాడల్లో ఇందిరమ్మ మోడల్ కాలనీలు, అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్‌రూం ఇళ్ల పూర్తి, పూర్తయిన ఇళ్ల కేటాయింపులపై శాసనసభ్యులతో కలిసి సమీక్షించి, నియోజకవర్గాల వారీగా అభిప్రాయాలు స్వీకరించారు. ఈ సమావేశంలో జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్, జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి, పీడీ హౌసింగ్ అశోక్ చక్రవర్తి, ఆర్డీవోలు రామకృష్ణ, సాయిరాం తదితరులు పాల్గొన్నారు



# జి.ఓ.ఎంఎస్ నెం.252 ప్రకారం జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డుల జారీ

సందేశం టైమ్స్, హైదరాబాద్, ఫిబ్రవరి 19: రాష్ట్రంలోని అర్హులైన జర్నలిస్టులందరికీ జి.ఓ.ఎంఎస్ నెం.252 ప్రకారం అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయనున్నట్లు సమాచార, పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ సిహెచ్. ప్రియాంక ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్, ఫ్రీలాన్సర్ మరియు వెటరన్ జర్నలిస్టులు అక్రిడిటేషన్ కోసం దరఖాస్తు చేసుకోవడానికి సమాచార శాఖ ప్రత్యేక వెబ్‌సైట్‌ను రూపొందించిందని వెల్లడించారు. ipr.telangana.gov.in వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 9వ తేదీ నుండి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరిస్తున్నామని, అక్రిడిటేషన్ దరఖాస్తు మరియు జారీ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని తెలిపారు. దరఖాస్తు చేసుకునే సమయంలో ఏవైనా సాంకేతిక సమస్యలు ఎదురైతే కార్యాలయ పని వేళల్లో ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు 9154170881 నంబర్‌కు సమాచార శాఖ మీడియా రిలేషన్ విభాగాన్ని సంప్రదించవచ్చని స్పష్టం చేశారు. ఈ ప్రకటనను సమాచార, పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ జారీ చేశారు.

# 2026-27 బడ్జెట్‌పై ఆర్&బీ సమీక్ష – రీజినల్ రింగ్ రోడ్, ఎన్‌హెచ్-65 విస్తరణకు వేగం

సందేశం టైమ్స్, హైదరాబాద్, ఫిబ్రవరి 19: రాష్ట్ర అభివృద్ధిలో రోడ్లు భవనాలు శాఖ కీలక పాత్ర పోషిస్తుందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. సచివాలయంలో 2026-27 వార్షిక బడ్జెట్ ప్రతిపాదనలపై సమీక్ష నిర్వహించిన మంత్రి, గత ఏడాది బడ్జెట్ కేటాయింపులు, పనుల పురోగతి, విడుదలైన నిధులపై కూలంకషంగా చర్చించారు. స్పెషల్ సీఎస్ వికాస్ రాజ్, ఈఎన్సీలు మోహన్ నాయక్, జయభారతి, సీఎఈలు శ్రీనివాస్ రెడ్డి, రాజేశ్వర్ రెడ్డి, వసంత్ నాయక్, బి.వి.రావు, లింగారెడ్డి, నర్సింగ్ రావు తదితర అధికారులు పాల్గొన్నారు. స్పష్టమైన ప్రణాళికతో బడ్జెట్ అంచనాలు సిద్ధం చేయాలని, రీజినల్ రింగ్ రోడ్ వంటి గేమ్ చేంజర్ ప్రాజెక్టులపై ప్రధాన దృష్టి సారించాలని మంత్రి ఆదేశించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో '2047 రైసింగ్ తెలంగాణ' లక్ష్యంతో రాష్ట్ర రోడ్ నెట్‌వర్క్ అభివృద్ధి అత్యంత కీలకమని, హ్యామ్ మోడల్ ద్వారా అద్దం లాంటి రోడ్లు నిర్మించబోతున్నామని తెలిపారు. కేంద్ర-రాష్ట్ర నిధుల వాటాపై ఎలాంటి గందరగోళం లేకుండా పారదర్శకంగా వ్యవహరించాలని సూచించారు. హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారి (ఎన్‌హెచ్-65) 8 లేన్ విస్తరణ పనులు త్వరలో ప్రారంభం కానున్నాయని, పనులు వేగంగా పూర్తి చేయాలని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని మరోసారి కోరనున్నట్లు చెప్పారు. ఈ రహదారి పూర్తయితే హైదరాబాద్ నుంచి విజయవాడకు రెండున్నర గంటల్లో చేరుకునే అవకాశం ఉంటుందని, రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర సహకార ప్రాజెక్టుల్లో వేగం పెంచేందుకు కేంద్ర మంత్రులను కలుస్తానని మంత్రి వెల్లడించారు.

# గ్రేటర్ హైదరాబాద్ మహానగర పాలక సంస్థ పౌర సేవలు ఇక ఒకే వేదికపై – 'మైక్యూర్' ప్రారంభం




సందేశం టైమ్స్, హైదరాబాద్, ఫిబ్రవరి 19: నగర పాలనను మరింత సమర్థవంతంగా, పారదర్శకంగా మార్చే దిశగా గ్రేటర్ హైదరాబాద్ మహానగర పాలక సంస్థ 'మైక్యూర్' సదుపాయాన్ని ప్రారంభించింది. ఇప్పటివరకు అమల్లో ఉన్న పాత విధానానికి బదులుగా రూపొందించిన ఈ నూతన వ్యవస్థ ద్వారా నగరంలోని అన్ని పౌర సేవలను ఒకే వేదికపై అందుబాటులోకి తీసుకువచ్చారు. పరిశుభ్రత, వీధి దీపాలు, రహదారులు, కాల్వలు, పట్టణ ప్రణాళిక తదితర అంశాలపై పౌరులు నేరుగా ఫిర్యాదులు నమోదు చేసుకునే అవకాశం కల్పించారు. నమోదు చేసిన ఫిర్యాదుల స్థితిని తక్షణమే తెలుసుకునే విధంగా ఏర్పాట్లు చేశారు. క్షేత్ర స్థాయి సిబ్బంది నుంచి ఉన్నతాధికారుల వరకు అనుసంధానం చేసి సమస్యల పరిష్కారాన్ని వేగవంతం చేయడం, బాధ్యతాయుత పాలనను బలోపేతం చేయడం లక్ష్యమని అధికారులు తెలిపారు. అన్ని వివరాలను కేంద్రీకృత పర్యవేక్షణ విధానంలో నమోదు చేసి పనితీరును నిరంతరం సమీక్షించేలా చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. పౌర సేవలన్నింటినీ ఒకే వేదికపై సమీకరించడం ద్వారా కార్యాలయాలకు ప్రత్యక్షంగా వెళ్లాల్సిన అవసరం తగ్గుతుందని పేర్కొన్నారు. నగర ప్రజలు ఈ సదుపాయాన్ని వినియోగించుకుని తమ సమస్యలను నమోదు చేసి త్వరితగతిన పరిష్కారం పొందాలని సంస్థ కోరింది.

# యాదాద్రి బ్రహ్మోత్సవాలకు రాష్ట్ర గవర్నర్‌ను ఆహ్వానించిన ఆలయ కార్యనిర్వాహక అధికారి



సందేశం టైమ్స్ , హైదరాబాద్, ఫిబ్రవరి 19, 2026: యాదాద్రిలోని యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం కార్యనిర్వాహక అధికారి శ్రీ జె. భవాని శంకర్ గారు తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శ్రీ జిష్ణు దేవ్ వర్మ గారిని మర్యాదపూర్వకంగా కలుస్తూ వార్షిక బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం అందజేశారు. ప్రతి సంవత్సరం ఘనంగా నిర్వహించే ఈ బ్రహ్మోత్సవాలకు దేశంలోని ప్రముఖులు, విశిష్ట అతిథులను ఆహ్వానించడం ఆలయ పరంపరగా కొనసాగుతున్నది. బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వహించే ఎడురుకోలు మహోత్సవం, స్వామివారి తిరుకళ్యాణం, రథోత్సవం వంటి వైభవోపేత ఆచారాలు భక్తులకు ఆధ్యాత్మిక ఆనందాన్ని పంచుతాయని కార్యనిర్వాహక అధికారి తెలిపారు. గవర్నర్ గారు బ్రహ్మోత్సవాల్లో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని ఆయన కోరారు. బ్రహ్మోత్సవాల నిర్వహణకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు ఆలయ అధికారులు సమగ్రంగా చేపట్టారు.

# నగర పరిశుభ్రతపై రాజీ లేదు – సీఎస్ కె. రామకృష్ణారావు



సందేశం టైమ్స్, హైదరాబాద్, ఫిబ్రవరి 19: గ్రేటర్ హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు అధికారులను ఆదేశించారు. గౌరవ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు బుధవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి నగర పరిశుభ్రతపై తీసుకుంటున్న చర్యలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమీక్షించారు. జిహెచ్ఎంసి పరిధిలో 4500 స్వచ్ఛ ఆటోలు ఇంటింటికి చెత్త సేకరణ చేస్తున్నాయని, 2650 స్వయం సహాయక బృందాల సభ్యులు కలిపి 18,557 మంది శానిటేషన్ విభాగంలో పనిచేస్తున్నారని కమిషనర్ ఆర్.వి. కర్ణన్ వివరించారు. నగరంలో రోజుకు సుమారు 7800 టన్నుల గార్బేజ్ సేకరణ జరుగుతోందని తెలిపారు. పరిశుభ్రత, చెత్త సేకరణ (డ్రై, వెట్ వ్యర్థాలు), ప్లాస్టిక్ వ్యర్థాల నియంత్రణ, మురుగునీటి శుద్ధి కేంద్రాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని సీఎస్ ఆదేశించారు. వివరాలను ఎప్పటికప్పుడు డాష్‌బోర్డ్‌లో పొందుపరచాలని, పారిశుధ్య పనుల పురోగతిని పర్యవేక్షించేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి సమయానుసార నివేదికలు సమర్పించాలని సూచించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని డ్రైనేజీ వ్యవస్థలను ముందస్తుగా శుభ్రపరిచే చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించమని హెచ్చరించారు. సమావేశంలో మున్సిపల్ శాఖ కార్యదర్శి టి.కె. శ్రీదేవి, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్, సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ శ్రీజన, మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి, జోనల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

# పురపాలక ఎన్నికల్లో బీసీల విజయం చైతన్యానికి నిదర్శనం: బీసీ కమిషన్

సందేశం టైమ్స్, హైదరాబాద్, ఫిబ్రవరి 19: రాష్ట్రంలో జరిగిన పురపాలక ఎన్నికల్లో బీసీలు మొత్తంగా 61 శాతం పైగా గెలుపొందడం పట్ల తెలంగాణ వెనుకబడిన తరగతుల కమిషన్ ఛైర్మన్ జి. నిరంజన్ మరియు సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మి రంగు హర్షం వ్యక్తం చేశారు. ఇటీవల జరిగిన పంచాయితీ ఎన్నికల్లో జనరల్ స్థానాల్లో కూడా బీసీ అభ్యర్థులు 52.75 శాతం గెలిచిన విషయాన్ని గుర్తుచేస్తూ, మున్సిపల్ వార్డుల్లో 28.22 శాతం, మున్సిపల్ కార్పొరేషన్‌లలో 35.25 శాతం రిజర్వేషన్ ఉన్నప్పటికీ జనరల్ స్థానాల్లోనూ గెలిచి మొత్తం మీద 61 శాతం విజయం సాధించడం బీసీ వర్గాల్లో పెరిగిన రాజకీయ చైతన్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. రాబోయే జెడ్‌పిటిసి, ఎంపిటిసి, జిహెచ్ఎంసి, కార్పొరేషన్ ఎన్నికల్లో కూడా బీసీలు అధిక సంఖ్యలో గెలుస్తారనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. రాష్ట్రంలో జరిగిన సమగ్ర సర్వేలో బీసీల జనాభా 56.33 శాతం ఉన్నట్లు తేలగా, 42 శాతం రిజర్వేషన్‌కు రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో బిల్లు ఆమోదించినప్పటికీ అది కేంద్ర ప్రభుత్వంలో పెండింగ్‌లో ఉండటం, కొందరు కోర్టులకు వెళ్లి అమలును అడ్డుకోవడం సముచితం కాదన్నారు. గత పంచాయితీ, ప్రస్తుత పురపాలక ఎన్నికల్లో బీసీల విజయాలను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్ల అమలుకు అనుమతి ఇచ్చి 9వ షెడ్యూల్‌లో చేర్చాలని, కోర్టుల్లో కేసులు వేసిన వారు తమ కేసులను ఉపసంహరించుకోవాలని బీసీ కమిషన్ విజ్ఞప్తి చేసింది.

# మాత శిశు కేంద్ర భవన నిర్మాణాలను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశం





సందేశం టైమ్స్ , సూర్యాపేట, ఫిబ్రవరి 19, 2026: మాత శిశు కేంద్ర భవన నిర్మాణాలను వేగవంతం చేసి వచ్చే నెలలో ప్రారంభానికి సిద్ధంగా ఉంచాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశించారు. బుధవారం సూర్యాపేట మాత శిశు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్, భవన నిర్మాణ పురోగతిని సమీక్షించారు. కోదాడలో నవజాత శిశువును వదిలేయడంపై కలెక్టర్ తీవ్ర బాధ వ్యక్తం చేశారు. పుట్టగానే శిశువులను వదిలేయడం బాధాకరమైనది అని పేర్కొన్నారు. సూర్యాపేట ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన ఉయ్యాలలో శిశువులను భద్రంగా ఉంచి తగిన సంరక్షణ ఇవ్వాలని సూచించారు. కోదాడలో నవజాత శిశువును కాపాడిన ఏఎన్ఎం ను కలెక్టర్ అభినందించారు.

కలెక్టర్ భవన నిర్మాణాలను వచ్చే నెలలో ప్రారంభానికి సిద్ధంగా ఉంచి, వచ్చే వారం సంబంధిత శాఖ అధికారులతో మరో సమీక్ష నిర్వహిస్తానని తెలిపారు. మాత శిశు కేంద్రంలో కావాల్సిన అన్ని ఎక్విప్‌మెంట్ కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని, సిబ్బంది సమయపాలన పాటిస్తూ రోగులకు వైద్య సౌకర్యాలు నిరంతరం అందించాలనూ సూచించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి వెంకటరమణ, సి.ఎస్. ఆర్ఎంఓ జనార్ధన్ రెడ్డి, డాక్టర్లు, డిడబ్ల్యూఓ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

# క్షయ రహిత జిల్లాగా సూర్యాపేటను తీర్చిదిద్దుదాం: డీఎంహెచ్ఓ డాక్టర్ పెండెం వెంకట రమణ

సందేశం టైమ్స్ సూర్యాపేట ప్రతినిధి: సూర్యాపేట జిల్లాను క్షయ రహిత జిల్లాగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలని జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి (DMHO) డాక్టర్ పెండెం వెంకట రమణ పిలుపునిచ్చారు. బుధవారం సూర్యాపేటలోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో ప్రోగ్రాం అధికారి డాక్టర్ ప్రసిద్ధ్ ఆధ్వర్యంలో, రాష్ట్ర WHO కన్సల్టెంట్ డాక్టర్ శ్రీగణ సమక్షంలో జిల్లాలోని వైద్యాధికారులు, MLHPలు, STS, STLS మరియు PHC TB నోడల్ అధికారులకు నిర్వహించిన పునశ్చరణ శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలోని అన్ని ఆరోగ్య కేంద్రాల్లో క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలని, ప్రాథమిక స్థాయిలోనే వ్యాధి లక్షణాలను గుర్తించి, ముఖ్యంగా వల్నరబుల్ జనాభాపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. వ్యాధి నిర్ధారణ అయిన వారికి నిరంతర పర్యవేక్షణలో ఉచితంగా మందులు, వైద్య పరీక్షలు అందజేస్తామని, సమాజంలో వ్యాధి వ్యాప్తి చెందకుండా ప్రభుత్వ లక్ష్యం మేరకు ప్రతి ఒక్కరూ తమ విధులను నిర్వర్తించాలని సూచించారు. జిల్లా టీబీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ప్రసిద్ధ్ మాట్లాడుతూ, జిల్లాలో ఇప్పటి వరకు 52,000 టీబీ నిర్ధారణ పరీక్షలు నిర్వహించామని, అందులో 1,742 మంది అనుమానితులను గుర్తించి 765 మందికి ప్రస్తుతం చికిత్స అందిస్తున్నామని వివరించారు. రాష్ట్ర WHO కన్సల్టెంట్ డాక్టర్ శ్రీగణ మాట్లాడుతూ, దగ్గు, ఆకలి మందగించడం, బరువు తగ్గడం, రాత్రి సమయాల్లో చెమటలతో కూడిన జ్వరం వంటి లక్షణాలు ఉన్నవారిని అనుమానితులుగా గుర్తించాలని, ప్రస్తుత WHO సూచనల మేరకు ఛాతి నొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, రక్తంతో కూడిన వాంతులు, అలసట వంటి లక్షణాలు ఉన్నవారికి కూడా అధునాతన సాంకేతిక పరికరాలతో పరీక్షలు చేయాలని తెలిపారు. వ్యాధిని ఎంత త్వరగా గుర్తిస్తే అంత త్వరగా అరికట్టవచ్చని, ముఖ్యంగా గర్భిణీలు, హెచ్ఐవీ, డయాబెటిస్ బాధితులు, వలస కార్మికులు, గనులు మరియు ఇటుక బట్టీల్లో పనిచేసేవారు ఈ వ్యాధి బారిన పడే అవకాశం ఎక్కువగా ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ జి. చంద్రశేఖర్, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ కోటి రత్నం, డాక్టర్ నాజియా తబస్సుమ్, డిప్యూటీ డెమో శ్రీ వి. సంజీవ్ రెడ్డి, డీపీఓ శ్రీమతి ఉమామహేశ్వరి మరియు ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# నల్గొండలో కృష్ణా నది ప్రాజెక్టులు వచ్చే వేసవికి పూర్తి: మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి





సందేశం టైమ్స్, సూర్యాపేట, ఫిబ్రవరి 19, 2026: ఉమ్మడి నల్గొండ జిల్లాలో కృష్ణా నదిపై నిర్మాణంలో ఉన్న అన్ని ఇరిగేషన్ ప్రాజెక్టులను వచ్చే వేసవికి పూర్తిచేసి అందుబాటులోకి తేవాలని రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి నల్లమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశించారు. బుధవారం మేళ్లచెరువు మైహోమ్ గెస్ట్ హౌస్‌లో ఇరిగేషన్ ప్రాజెక్టులపై సమీక్ష సమావేశం నిర్వహించిన మంత్రి, జిల్లాలో నిర్మాణంలో ఉన్న రాజీవ్ గాంధీ లిఫ్ట్ ఇరిగేషన్, తొండపాడు లిఫ్ట్ ఇరిగేషన్, రెడ్లకుంట లిఫ్ట్ ఇరిగేషన్, నక్కగూడెం గిఫ్ట్ ఇరిగేషన్, ముక్త్యాల బ్రాంచ్ లిఫ్ట్ ఇరిగేషన్, జాన్పాడు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులన్నీ వేగంగా పూర్తి చేయాలని, అవసరమైతే 24 గంటలు పనులు నడిచే విధంగా చూడాలని సూచించారు.ప్రాజెక్టులకు సంబంధించిన సైడ్ కాలువలకు భూసేకరణను వేగవంతం చేసి, భూసేకరణ పూర్తయిన వాటికి వెంటనే నిధులు చెల్లించాలన్నారు. ఎక్కడ ఎలక్ట్రిసిటీ సబ్‌స్టేషన్లు అవసరమో అక్కడ వెంటనే పనులు ప్రారంభించాలని, ఎస్సారెస్పీ ఫేస్-2 మరియు ఎన్ఎస్పీ కింద ఉన్న పొలాలకు వారాబంది ప్రకారం నీరు సరఫరా చేయాలని మంత్రి ఆదేశించారు. ప్రతి ఎకరం ఎండిపోకుండా చూడాలని, నాగార్జునసాగర్‌లో వేసవిలో మూడుసార్లు నిండిన నీటి సీజన్లను తలచుకుంటూ, రాష్ట్ర చరిత్రలో అత్యధికంగా వరి పండినదని, వరికి అత్యధిక మద్దతు ధర చెల్లించి చరిత్ర సృష్టించినందున ఇదే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి అన్నారు.సమావేశంలో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, జిల్లా ఎస్పీ కే నరసింహ, ఇరిగేషన్ శాఖ ఎస్సీ, హుజూర్నగర్ ఆర్డిఓ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



# సూర్యాపేటలో కొత్త కేంద్రీయ విద్యాలయ స్థల పరిశీలన

సందేశం టైమ్స్, సూర్యాపేట, ఫిబ్రవరి 19, 2026: సూర్యాపేట జిల్లాలో నూతనంగా ఏర్పాటు చేయనున్న కేంద్ర విద్యాలయ నిర్మాణానికి కావలసిన స్థలాన్ని సేకరించడానికి సూర్యాపేట మున్సిపల్ పరిధిలోని కేసారం ప్రాంతాన్ని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పరిశీలించారు.స్థల పరిశీలన బృందంలో కేంద్ర విద్యాలయ సంఘటన్ డిప్యూటీ కమిషనర్ సంతోష్, అసిస్టెంట్ కమిషనర్ ఇజ్రాయిల్, నల్గొండ కేంద్ర విద్యాలయం ప్రిన్సిపాల్ శ్రీనివాస్, సూర్యాపేట ఆర్డీవో వేణుమాధవ్, తాసిల్దార్ కృష్ణయ్య పాల్గొన్నారు. బృందం స్థల పరిస్థితులను పరిశీలించి, విద్యాలయ నిర్మాణానికి తగిన ప్రాంతాన్ని నిర్ణయించడానికి అధికారులు చర్చలు నిర్వహించారు.

# సూర్యాపేట జిల్లా గెజిటెడ్ అధికారుల సంఘం ఇరిగేషన్ మంత్రి కలయిక



సందేశం టైమ్స్ , సూర్యాపేట, ఫిబ్రవరి 19, 2026: ఈ రోజు సూర్యాపేట జిల్లా గెజిటెడ్ అధికారుల సంఘం సభ్యులు మర్యాదపూర్వకంగా ఇరిగేషన్ శాఖ మంత్రి కెప్టెన్ నలమాల ఉత్తమ్ కుమార్ రెడ్డిను కలిశారు. ఈ సందర్భంగా సంఘం వారి డైరీని మంత్రి గారికి అందజేశారు.కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు భూపాల్ రెడ్డి, సెక్రటరీ బుక్య పాండు, అసోసియేట్ ప్రెసిడెంట్ నాగేంద్ర, కోశాధికారి రవికుమార్, వైస్ ప్రెసిడెంట్ స్వప్న, దేవా బిక్షం, జాయింట్ సెక్రటరీ పద్మావతి, స్పోర్ట్స్ & కల్చర్ సెక్రటరీ మల్సూర్, ఆర్గనైజ్ సెక్రటరీ ఉదయ్ కుమార్, అలాగే ఇరిగేషన్ శాఖ డి.ఈ.లు, ఏ.ఈ.లు పాల్గొని జిల్లా అభివృద్ధి, ఇరిగేషన్ పనులపై చర్చలు జరిపారు.

# ఆందోల్-జోగిపేట్ మున్సిపాలిటీలో నూతన ప్రజాప్రతినిధులకు ఘన సన్మానం



సంగారెడ్డి సందేశం టైమ్స్,జోగిపేట, ఫిబ్రవరి 19, 2026: సంగారెడ్డి జిల్లా ఆందోల్-జోగిపేట్ మున్సిపాలిటీలో నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధుల కోసం ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. మున్సిపాలిటీ కమిషనర్ రవీందర్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయంలో పూజా కార్యక్రమం అనంతరం సన్మాన కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా నూతన చైర్మన్ కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ చిట్టిబాబు, 13వ వార్డ్ కౌన్సిలర్ పట్లు రీ శేఖర్, 8వ వార్డ్ కౌన్సిలర్ రాచకొండ రత్నం గౌడ్, 16వ వార్డ్ కౌన్సిలర్ పట్టుల శ్రీనివాస్, 10వ వార్డ్ కౌన్సిలర్ పట్లోళ్ల రేఖ ప్రవీణ్, 11వ వార్డ్ కౌన్సిలర్ కల్పనా నాగరాజ్‌లను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు.ప్రముఖ ప్రజాప్రతినిధులు కార్యక్రమంలో మాట్లాడుతూ మున్సిపాలిటీ అభివృద్ధికి అంకితం చేసుకుని కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# మేళ్లచెరువు శివాలయంలో ఎడ్ల పందాల పోటీలకు మంత్రి ప్రారంభం


## రాష్ట్ర మంత్రి మేళ్లచెరువు శివాలయంలో ప్రత్యేక పూజలు





సందేశం టైమ్స్,.సూర్యాపేట, ఫిబ్రవరి 19, 2026: రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి నల్లమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి బుధవారం మేళ్లచెరువు శివాలయం సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు, దేవస్థానం చైర్మన్ మరియు కార్యనిర్వాహక అధికారి పూర్ణకుంభంతో మంత్రికి స్వాగతం పలికారు.అంతేకాకుండా, మంత్రి రాష్ట్ర స్థాయి జాతీయ ఎడ్ల పందాల పోటీలను ప్రారంభించి ప్రసంగించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, మేళ్లచెరువు జాతరకు ప్రభుత్వం కోటి రూపాయలు మంజూరు చేసినదని, ఎడ్ల పందాల పోటీలను ప్రారంభించడం ఎంతో సంతోషకరమైనదని తెలిపారు. జిల్లాలోని ఇరిగేషన్ ప్రాజెక్టులను త్వరలో పూర్తి చేసి, సౌకర్యాలను మరింత అభివృద్ధి చేయడంతో ఈ ప్రాంతాన్ని రాష్ట్రంలో ముందున్న ప్రాంతంగా నిలిపివేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో దేవస్థానం ఉత్సవ కమిటీ చైర్మన్ పెల్లి లచ్చయ్య, దేవస్థానం కార్యనిర్వాహక అధికారి నాగళ్ళ సమ్మిరెడ్డి, దొంత గాని శ్రీనివాస్, నర్సిరెడ్డి, వీరారెడ్డి, భాస్కర్ రెడ్డి, అరుణ్ దేశ్ముకు తదితరులు పాల్గొన్నారు.

# నారాయణఖేడ్ మున్సిపల్ చైర్మన్ నాగేష్ కూమార్ షేట్కార్ ఘన సన్మానం



తెలంగాణ | సంగారెడ్డి జిల్లా

నారాయణఖేడ్ ప్రతినిధి: టి. చంద్రశేఖర్, నారాయణఖేడ్, ఫిబ్రవరి 19 (సందేశం టైమ్స్) – సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మున్సిపాలిటీ పరిధిలో, జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ కుమార్ షేట్కార్ స్వగృహంలో బుధవారం ఆత్మీయ వాతావరణంలో మర్యాదపూర్వక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నారాయణఖేడ్ మున్సిపల్ చైర్మన్ గా ఎన్నికైన నాగేష్ కూమార్ షేట్కార్ ను నేషనల్ హ్యూమన్ రైట్స్, సోషల్ జస్టిస్, సోషల్ సర్వీస్ ఫర్ చేంజ్ ఆఫ్ ఇండియా రాష్ట్ర వైస్ చైర్మన్ వై. పండరి, జిల్లా అధ్యక్షులు బైండ్ల కృష్ణ, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ ప్రభాకర్, న్యాల్‌కల్ మండల అధ్యక్షులు నవీన్ కుమార్ మరియు కమిటీ సభ్యులు శాలువాతో ఘనంగా సన్మానించారు.

కమిటీ సభ్యులు చైర్మన్‌కి మంచి భవిష్యత్తు ఆకాంక్షిస్తూ మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేయమని ప్రోత్సహించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు మరియు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# యాసంగి పంటల వివరాల నమోదు ప్రారంభం, ప్రభుత్వ మద్దతు ధరకు విక్రయానికి అవకాశం



సంగారెడ్డి జిల్లా ప్రతినిధి: టీ. సంగమేశ్వర్ , వట్పల్లి మేడికుంద, ఫిబ్రవరి 19 (సందేశం టైమ్స్) – మేడికుంద గ్రామంలో యాసంగి కాలంలో సాగు చేస్తున్న పంటల వివరాల నమోదు కార్యక్రమం ఆత్మ కమిటీ చైర్మన్ కాచూర్ రావు ఆధ్వర్యంలో నిర్వహించబడింది. గ్రామ రైతులు సాగు చేస్తున్న శనగలు, జొన్న, కుసుమ, ఉల్లిగడ్డ, నల్లకుసుమ తదితర పంటల వివరాలను వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ) కళ్యాణ్ నమోదు చేశారు.ఈ సందర్భంగా ఆయన తెలిపారు, నమోదు చేసిన పంటలను కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ద్వారా ప్రభుత్వ మద్దతు ధరకు విక్రయించేందుకు సులభంగా అవకాశం లభిస్తుందని. అందువల్ల రైతులు తప్పనిసరిగా పంట వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. ఇప్పటికే నమోదు చేసుకున్న రైతులు ఏఈఓ కళ్యాణ్ కు కృతజ్ఞతలు తెలిపారు. అందుబాటులో లేని రైతులు వచ్చే రెండు మూడు రోజులలో రైతు వేదికను సందర్శించి పంట వివరాలు నమోదు చేసుకోవచ్చని ఆయన తెలియజేశారు.

# మున్సిపల్ కార్మికులకు దుస్తుల పంపిణీ, పండుగల సందర్భంగా శానిటేషన్ పనులపై ప్రత్యేక దృష్టి



సంగారెడ్డి ప్రతినిధి: టీ. సంగమేశ్వర్, ఆందోల్, ఫిబ్రవరి 19 (సందేశం టైమ్స్) – ఆందోల్-జోగిపేట పురపాలక సంఘం నూతన పాలకవర్గం ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయంలో పూజా కార్యక్రమం నిర్వహించి తొలి సమావేశం చేపట్టారు. సమావేశానికి మున్సిపల్ చైర్మన్ ఎస్. కిష్టారెడ్డి అధ్యక్షత వహించారు.ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ ఆకుల సత్యనారాయణ (చిట్టిబాబు), మున్సిపల్ కమిషనర్ ఏ. రవీందర్, కౌన్సిలర్లు పాల్గొన్నారు. రాబోయే పండుగలను దృష్టిలో ఉంచుకుని పట్టణంలో శానిటేషన్ పనులను వేగవంతం చేయడం, అవసరమైన చోట్ల వీధి దీపాల ఏర్పాటు చేయడం వంటి అంశాలపై చర్చించారు.ఈ సందర్భంగా శానిటేషన్ సిబ్బందికి దుస్తులు, సబ్బులు తదితర అవసరమైన వస్తువులను వైస్ చైర్మన్ ఆకుల సత్యనారాయణ జెల్ల గురిచరణ్‌కు పంపిణీ చేశారు. కార్మికుల సంక్షేమం కోసం మున్సిపాలిటీ కట్టుబడి ఉంటుందని ఆయన తెలిపారు.

# పిప కుమార్తె నామకరణానికి హాజరైన మంత్రి దామోదర్ రాజనర్సింహ



ఆందోల్ ప్రతినిధి: బి. రమేష్ బాబు,సంగారెడ్డి, ఫిబ్రవరి 19 (సందేశం టైమ్స్) – సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లోని పద్మశాలి భవనంలో బుధవారం నిర్వహించిన నామకరణ మహోత్సవానికి రాష్ట్ర మంత్రి దామోదర్ రాజనర్సింహ హాజరయ్యారు. తన వ్యక్తిగత సహాయకుడు శ్రీధర్ – నాగలక్ష్మి దంపతుల కుమార్తె నామకరణ కార్యక్రమంలో పాల్గొని ఆశీర్వదించారు.ఈ సందర్భంగా శిశువుకు "తన్వీక" అని నామకరణం చేయగా, మంత్రి పాపను ఎత్తుకొని ముద్దాడారు. శ్రీధర్ దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. కుటుంబ సభ్యులతో కాసేపు ఆత్మీయంగా ముచ్చటించారు.మంత్రిగారి రాకతో కార్యక్రమానికి ప్రత్యేక శోభ చేకూరింది. కుటుంబ సభ్యులు ఆనందాన్ని వ్యక్తం చేశారు.



# ఎస్.ఐ.ఆర్ అమలులో స్పష్టమైన పురోగతి సాధించాలి, 10 రోజుల్లో 85% ఓటర్ మ్యాపింగ్ పూర్తి చేయాలి: జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య


సంగారెడ్డి ప్రతినిధి: టీ సంగమేశ్వర్, సంగారెడ్డి, ఫిబ్రవరి 19 (సందేశం టైమ్స్) – ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్.ఐ.ఆర్) ప్రక్రియను ప్రతి పోలింగ్ స్టేషన్ పరిధిలో సమర్థవంతంగా అమలు చేసి స్పష్టమైన పురోగతి సాధించాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అధికారులను ఆదేశించారు.బుధవారం కలెక్టరేట్ వీసీ హాల్‌లో ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు, బీఎల్ఓ సూపర్వైజర్లతో ప్రీ–ఎస్.ఐ.ఆర్ పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. పోలింగ్ కేంద్రాల వారీగా పురోగతిని పరిశీలించిన కలెక్టర్, పనితీరులో వెనుకబడి ఉన్న ఏఈఆర్ఓల నుంచి కారణాలు అడిగి తెలుసుకున్నారు.జిల్లాలో ఇప్పటివరకు 51.96 శాతం మాత్రమే ఓటర్ మ్యాపింగ్ పూర్తయిందని తెలిపారు. ముఖ్యంగా అర్బన్ సెగ్మెంట్‌లో పురోగతి తక్కువగా ఉన్నందున డోర్ టు డోర్ సందర్శనల ద్వారా ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. వచ్చే పది రోజుల్లో కనీసం 85 శాతం పురోగతి సాధించాలని, ఈ విషయంలో ఈఆర్ఓలు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.తక్కువ పురోగతి ఉన్న బీఎల్ఓలు, బీఎల్ఓ సూపర్వైజర్లతో సమీక్షించి సమస్యలను వెంటనే పరిష్కరించాలని, ఏఈఆర్ఓలు వారం రోజుల పాటు ప్రతిరోజూ మూడు ప్రాంతాల్లో ఆకస్మిక క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహించి రోజువారీ సమీక్ష చేయాలని స్పష్టం చేశారు. పనితీరు సంతృప్తికరంగా లేని బీఎల్ఓలు, బీఎల్ఓ సూపర్వైజర్లపై తగిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు.ఓటర్ మ్యాపింగ్‌లో పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, కొత్తగా విలీనం అయిన ప్రాంతాలు, కాలనీలపై ప్రత్యేక దృష్టి సారించాలని, డెమోగ్రాఫిక్ సిమిలర్ ఎంట్రీస్‌కు సంబంధించిన పెండింగ్ అంశాలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.సమావేశంలో అదనపు కలెక్టర్లు మాధురి, పాండు, ఆర్డీఓ రాజేందర్, ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు, బీఎల్ఓ సూపర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

# రంజాన్ ఉపవాస కార్డుల విడుదల, ముస్లిం సోదరులకు రంజాన్ ముబారక్ శుభాకాంక్షలు తెలిపిన బీఆర్ఎస్ నాయకులు



సంగారెడ్డి ప్రతినిధి: టీ సంగమేశ్వర్,రామచంద్రాపురం, ఫిబ్రవరి 19 (సందేశం టైమ్స్) – రామచంద్రాపురంలో రంజాన్ పండుగను పురస్కరించుకుని బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రంజాన్ ఉపవాస కార్డుల విడుదల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పటాన్‌చెరు నియోజకవర్గ సమన్వయకర్త వెన్నవరం ఆదర్శ్ రెడ్డి, పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, టీపీయూఎస్ మండల అధ్యక్షుడు అబ్బు అలీ ఖురేషి హాజరయ్యారు.ఈ సందర్భంగా నాయకులు రంజాన్ ఉపవాస కార్డులను విడుదల చేసి రామచంద్రాపురం ప్రాంతంలోని ముస్లిం సోదరులకు పంపిణీ చేశారు. రంజాన్ మాసం శాంతి, సౌభ్రాతృత్వానికి ప్రతీకగా నిలుస్తుందని వారు పేర్కొన్నారు.టీపీయూఎస్ మండల అధ్యక్షుడు అబ్బు అలీ ఖురేషి మాట్లాడుతూ దేశంలోని సమస్త ముస్లింలకు, హిందువులకు రంజాన్ ముబారక్ శుభాకాంక్షలు తెలిపారు. అన్ని మతాల ప్రజలు ఐక్యతతో జీవించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# శ్రీ నల్ల పోచమ్మ తల్లి ఆలయానికి ఫ్యాన్ల విరాళం, తుమ్మూరు దంపతుల సేవకు అభినందనలు



సంగారెడ్డి ప్రతినిధి: టీ సంగమేశ్వర్, మనూర్, బోరంచ, ఫిబ్రవరి 19 (సందేశం టైమ్స్) – బోరంచ గ్రామంలో మంజీర నది ఒడ్డున వెలిసిన శ్రీ నల్ల పోచమ్మ తల్లి ఆలయంకు తుమ్మూరు గ్రామానికి చెందిన రమేష్ దంపతులు ఆరు ఫ్యాన్లను విరాళంగా అందజేశారు.మనూర్ మండలం తుమ్మూరు గ్రామానికి చెందిన రమేష్ దంపతులు ఆలయ అభివృద్ధికి తమ సేవలను అంకితం చేసారు. విరాళంగా అందించిన ఫ్యాన్లను ఆలయ చైర్మన్ బెల్లాపురం మల్లన్న, అర్చకులు సిద్ధయ్య స్వామికి అందజేశారు.ఈ సందర్భంగా అర్చకులు సిద్ధయ్య స్వామి ప్రత్యేక పూజలు నిర్వహించి, దాతలు రమేష్ దంపతులు మరియు వారి కుటుంబ సభ్యులకు అమ్మవారి ఆశీర్వాదాలు కలగాలని ప్రార్థించారు. ఆలయ అభివృద్ధికి సహకరించిన దాతలకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

# క్షేత్రస్థాయి శిక్షణ అత్యంత కీలకం: గ్రామాల అభివృద్ధిలో అధికారుల పాత్ర ముఖ్యమని కలెక్టర్ సూచనలు

## గ్రూప్-వన్ అధికారులకు జిల్లా కలెక్టర్ సూచనలు: గ్రామాల్లో అభివృద్ధి పనులను సమగ్రంగా పరిశీలించాలి





సంగారెడ్డి ప్రతినిధి: టీ సంగమేశ్వర్, సంగారెడ్డి, ఫిబ్రవరి 19 – క్షేత్రస్థాయి సందర్శన శిక్షణ ద్వారా అధికారులు ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా అర్థం చేసుకునే అవకాశం లభిస్తుందని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య పేర్కొన్నారు. గ్రామస్థాయిలో పథకాల అమలు, ప్రజల జీవన విధానం, అభివృద్ధి కార్యక్రమాల ప్రభావం వంటి అంశాలను సమగ్రంగా అధ్యయనం చేసినప్పుడే భవిష్యత్తులో సమర్థవంతంగా ప్రజలకు సేవలు అందించగలరని ఆయన చెప్పారు.రెండు రోజుల శిక్షణలో బడంపేట, సజ్జాపూర్, అనంతసాగర్, మల్లేపల్లి, గొంగళూరు, బస్వాపూర్, అరూర్, వెల్టూర్, అల్గోల్, మల్ చల్మా గ్రామాలను ఆరు శాఖలకు చెందిన 60 మంది గ్రూప్-వన్ అధికారులు సందర్శించారు. గ్రామాల్లో పాఠశాలలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అంగన్వాడీ కేంద్రాలు, అమలవుతున్న ప్రభుత్వ పథకాలు, ఉపాధి హామీ పథకం పనులను పరిశీలించారు.అధికారులు గ్రామ ప్రజలు, స్వయం సహాయక సంఘాల మహిళలతో ముఖాముఖి మాట్లాడి అభిప్రాయాలను తెలుసుకున్నారు. కలెక్టర్ ఈ సమావేశంలో గ్రామ మరియు జిల్లా అభివృద్ధిలో అధికారుల పాత్ర కీలకమని, ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు మమేకమై కృషి చేయాలని సూచించారు. పరిపాలనలో పారదర్శకత, సమర్థత ఎంతో ముఖ్యమని వివరించారు.గ్రూప్-వన్ అధికారులు గ్రామాల్లో ఇందిరా మహిళ కార్యక్రమం సమర్థవంతంగా అమలవుతోందని, స్వయం సహాయక సంఘాల మహిళలు రుణాల ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నట్లు గమనించినట్లు తెలిపారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాలు మెరుగ్గా ఉన్నాయని, అభివృద్ధి సంతృప్తికరంగా ఉందని అభిప్రాయపడ్డారు.కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ పాండు, నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమా హారతి, జడ్పీ సీఈవో జానకి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మాజీ మంత్రి హరీష్ రావును నారాయణఖేడ్ జీఎంఆర్ బృందం మర్యాదపూర్వకంగా కలిసింది; నూతన సర్పంచులు, బీఆర్ఎస్ నాయకులు అభినందనలు తెలిపారు





నారాయణఖేడ్, ఫిబ్రవరి 19 (సందేశం టైమ్స్ నారాయణఖేడ్ ప్రతినిధి టీ సంగమేశ్వర్): హైదరాబాద్‌లో మాజీ మంత్రి, సిద్దిపేట శాసనసభ్యుడు తన్నీరు హరీష్ రావును నారాయణఖేడ్ నియోజకవర్గానికి చెందిన జీఎంఆర్ బృందం మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా జీఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ నాయకుడు గుర్రపు మచ్చేందర్ ఆధ్వర్యంలో నూతనంగా గెలుపొందిన సర్పంచులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, తెలంగాణ రాష్ట్ర మాజీ ఆత్మ కమిటీ డైరెక్టర్ అనుమల మారుతి, రానాపూర్ సర్పంచ్ ఎంబడి సంగారెడ్డి, సంగెం సర్పంచ్ ధర్మానాయక్, గౌడ్గమ్ సర్పంచ్ తనజీ పటేల్, ఎడ్ల రేగడి తండా సర్పంచ్ బలరాం నాయక్, సుకల్తీర్థ్ సర్పంచ్ నీలేష్, రాసోల్ సర్పంచ్ యేసు, రేకే నాయక్ తండా సర్పంచ్ శంకర్, కిషన్ నాయక్ తండా సర్పంచ్ సంజు, దామరగిద్ద ఉప సర్పంచ్ సుభాష్, జిరిగి తండ ఉప సర్పంచ్ సురేష్, జిరిగి తండ మాజీ ఎంపీటీసీ కిరణ్, దామరగిద్ద మాజీ సర్పంచ్ శంకర్ సాగర్, సీతారాం తండా మాజీ సర్పంచ్ రాజు నాయక్, మాజీ సర్పంచ్ పుండ్లిక్, రాసోల్ మాజీ సర్పంచ్ సాయిలు, సుకల్తీర్థ్ మాజీ సర్పంచ్ విజయ్ పటేల్ తదితరులు హాజరయ్యారు. అలాగే బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు బసవరాజ్ పటేల్, గుర్రపు జ్ఞానేశ్వర్, బోరంచ సంగారెడ్డి, మోట్లకుంట నర్సింలు, బెల్లాపూర్ బసవరాజ్ పటేల్, గాంధీనగర్ హనుమాన్లు, హర్షవర్ధన్ రెడ్డి, సందీప్ మరియు యువత పాల్గొన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ అభివృద్ధి, గ్రామాల పురోగతి, సామాజిక సమస్యలు మరియు భవిష్యత్తు ప్రణాళికలపై చర్చ జరిపారు.

# ఘనంగా సందీప్ కుమార్ జన్మదిన వేడుకలు



సంగారెడ్డి, ఫిబ్రవరి 19 (సందేశం టైమ్స్ సంగారెడ్డి జిల్లా ప్రతినిధి టి సంగమేశ్వర్): సంగారెడ్డి జిల్లాలో సందీప్ కుమార్ గారి జన్మదిన వేడుకలు కుటుంబసభ్యులు, స్నేహితులు ప్రత్యేకంగా జరుపుకున్నారు. ఈ సందర్భంలో కేక్ కట్, పూలమాలలు, బహుమతుల పంపిణీ వంటి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించబడ్డాయి. స్నేహితులు, కుటుంబసభ్యులు సందీప్ కుమార్‌కు శుభాకాంక్షలు తెలియజేసి ఆయనకు ఆరోగ్యం, ఆనందం, విజయాలు కలగాలని ఆకాంక్షించారు.

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) రిజిస్ట్రేషన్ నం. : TGTEL/25/A0348 , టైటిల్ కోడ్ : Sandhesham Times.ప్రచురణ స్థలం :3- 82 వాయిల సింగారం, అనంతగిరి మండలం,సూర్యాపేట జిల్లా, తెలంగాణ – 508206, ప్రచురణకర్త (Publisher): మద్దినేని నాగేశ్వర రావు, సంపాదకులు (Editor) : కాసే అమృత,మొబైల్ : 9052045435, ఈ-మెయిల్ : sandeshamtimes@gmail.com, వెబ్‌సైట్ : www.sandeshamtimes.com,ముద్రణ (Printed at) : సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press)3-4297, సరస్వతి కాంప్లెక్స్, SVN కాలనీ, గుంటూరు,ఆంధ్రప్రదేశ్ – 522006.